క్లుప్తంగా

తాగునీరు కలుషితం



మురుగు నీటిలో పగిలిన తాగునీటి పైప్‌లైన్

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో రోగాలు ప్రబలుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీకి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ డ్రైనేజీలో ఉంది. అక్కడ పైప్ లైన్ పగలడంతో తాగునీరు కలుషితంగా సరఫరా అవుతోంది. దీంతో కాలనీవాసులను వాంతులు, విరేచనాలు వెంటాడుతున్నాయి. రోగం వస్తే వైద్యం చేయించుకోలేని దుర్భర ఆర్థిక పరిస్థితి కాలనీవాసులది. సంబంధితాధికారులు తక్షణం స్పందించి పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి ఆరోగ్యం కాపాడాలంటూ వారు కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న సంస్థ సభ్యులు

పుట్లూరు/తాడిపత్రి అర్బన్: గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ బాధితురాలికి ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆర్థిక సాయం చేసింది. పుట్లూరు మండలంలోని గోపరాజుపల్లికి చెందిన కుళ్లాయప్ప భార్య దూదేకుల యర్రమ్మ కొంతకాలంగా గొంతు కేన్సర్ వ్యాధితో బాధపడుతుండేది. విషయం తెలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు ఆదివారం గోపరాజు పల్లికి వెళ్లి బాధితురాలికి చికిత్స నిమిత్తం రూ.20 వేల నగదును ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, గౌరవాధ్యక్షుడు శ్రీహరి, కన్వీనర్ శంకర్, ఉపాధ్యక్షులు లాయర్ కుమారస్వామి, శ్రీనివాసులు, సభ్యులు కుమారస్వామి, శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు పెద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు



గాయపడ్డ లక్ష్మయ్య

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి గ్రామం బాట సుంకులమ్మ ఆలయ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బాచుపల్లికి చెందిన లక్ష్మయ్య పని నిమిత్తం నంద్యాల జిల్లా ప్యాపిలికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గ్రామానికి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మయ్య తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో గోల్డెన్ కేఫ్ హోటల్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. జొన్నగిరికి చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు ద్విచక్రవాహనంలో అనంతపురం బయలుదేరారు. గోల్డెన్ కేఫ్ హోటల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నడిరోడ్డుపై మొరాయించిన ఐచర్



రోడ్డుపై నిలిచిన ఐచర్ వాహనం

గుత్తి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం ఓ ఐచర్ వాహనం నడిరోడ్డుపై మొరాయించింది. సుమారు అర గంటకు పైగా రోడ్డుపై నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తింది. ఎపుడు రద్దీగా ఉండే ప్రాంతంలో ఐచర్ వాహనం రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. అరగంట తర్వాత మెకానిక్‌లు ఐచర్‌ను మరమ్మతు చేశారు. దీంతో ఐచర్ వాహనం అక్కడి నుంచి వెళ్లిపోయింది.

అవగాహనతోనే పరిహారం

- జీవాలకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- అవగాహన లేక నష్టపోతున్న పాడి రైతులు



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన పాడి ఆవు (ఫైల్)

గార్లదిన్నె: వర్షాలు, తుపాను సమయంలో ప్రమాదవశాత్తు పశువులు విద్యుదాఘాతానికి గురవుతుంటాయి. రూ.లక్షలు విలువ చేసే ఎద్దులు, పాడి పశువులు అక్కడికక్కడే మృతి చెందిన దాఖలాలున్నాయి. అలాగే వర్షాలు, ఈదురు గాలులు, తుపానుల సమయంలో విద్యుత్ తీగలు తెగి కింద పడుతుంటాయి. వీటిని గమనించకపోవడంతో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా అనేక మంది క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు విద్యుత్‌శాఖ పరిహారం అందించి ఆదుకుంటుంది. అయితే ఈ పరిహారంపై బాధితులకు అవగాహన లేక పోవడంతో చాలామంది నష్టపోతున్నారు.

ఇలా చేయాలి..

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం కోసం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. కేసు నమోదు అయిన తర్వాత శవ పంచనామా చేయించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్ శాఖ సహాయక ఇంజినీర్ (ఏఈ) దరఖాస్తు చేసుకోవాలి. మరణ ధ్రువీకరణ పత్రం, ఎఫ్ఐఆర్ ,పంచనామా నివేదిక, ఆధార్, బ్యాంకు పుస్తకం తదితర కాపీలను జత చేసి విద్యుత్ ఏఈకి అందజేయాలి. ఏఈ నుంచి ఆ పత్రాలు ఏడీఈకి చేరుతాయి. ఆ పత్రాలు ఉన్నతాధికారులకు అందిన తర్వాత నష్ట పరిహారం బాధితుల బ్యాంకు ఖాతాలో జమవుతుంది.

వ్యక్తులకు అంగవైకల్యం కలిగితే..

విద్యుత్ ప్రమాదం వల్ల అంగవైకల్యం కలిగితే ప్రమాద విషయాన్ని వెంటనే విద్యుత్ శాఖాధికారులకు తెలియజేయాలి. వైద్యం నిమిత్తం అయిన ఖర్చు బిల్లులు, ఇతర ఖర్చుల వివరాలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుకు జతపరిచి విద్యుత్ శాఖ ఏఈకి అందించాలి. ఉన్నతాధికారులు వాటిని పరిశీలించి నష్టపరిహారం మంజూరు చేస్తారు.

మూగజీవాలు మృతి చెందితే..

పశువులు, విద్యుదాఘాతానికి గురై మృతి చెందితే ముందుగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, వీఆర్ఓ, తహసీల్దార్‌కు సమాచారం అందించాలి. పశువైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మృతి చెందినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. మృతి చెందిన పశువు నిమిత్తం పరిహారం బాధితుడికి అందిస్తారు. పశు వైద్యులు సూచించిన మేరకే నష్టపరిహారం అందుతుంది.

అర్హులకు వెంటనే పరిహారం

విద్యుత్ ప్రమాదాలకు సంబంధించిన బాధిత కుటుంబాలు అర్హులైతే పరిహారం తప్పకుండా అందుతుంది. ప్రమాదం జరిగిన స్థాయిని బట్టి పరిహారం ఉంటుంది. నిబంధనల ప్రకారం అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. మూగజీవాల విషయంలో పశువైద్యాధికారి ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని పరిగణలోకి తీసుకుంటున్నాం.ప్రమాదాలు బారిన పడిన వెంటనే అధికారులకు తెలియజేయాలి. గ్రామాల్లో కూడా సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

–విజయ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఈ, గార్లదిన్నె

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగి న పనులపై సోషల్ ఆడిట్ చేస్తున్నట్లు ఏపీఓ నాంచారమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31 వరకూ రూ.8.3 కోట్లతో ఉపాధి పనులు, రూ 1.57 కోట్లతో మెటీరియల్ పనులు జరిగాయన్నారు. ఈ నెల 30 వరకూ సోషల్ ఆడిట్ సిబ్బంది ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహిస్తారన్నారు. గ్రామసభలు అనంతరం మండల యిలో ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు.

నేడు 'గ్రీవెన్స్ డే'

యల్లనూరు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని తహసీల్దారు జయప్రసాద్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్జీదారులు కార్యాలయానికి వినతులతో వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు కొనసాగిస్తాం





గుంతకల్లు, తాడిపత్రిలో ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి/పుట్లూరు/తాడిపత్రి అర్బన్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు పాటుపడతామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్ తెలిపారు. ఆదివారం గుంతకల్లులోని ఇల్లూరుభవన్‌లో ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, నాయకులు హరినాథ్, రామయ్య, రాఘవ, శ్రీనివాసులు, మధు, తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలోని బీజేపీ కార్యాలయంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు బాలకృష్ణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పుట్లూరు మండలంలోని తక్కళ్లపల్లిలో నిర్వహించిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కారక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామాంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిపత్రిలోని 25వ వార్డులో ఉన్న బీజేపీ కార్యాలయంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సింగిరి లక్ష్మీనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ చెన్నా రంగనాయకులు, నాయకులు శేషఫణి, రవితేజ, సునీల్, ప్రవీణ్, లోకేష్, చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

అభయ విద్యానిధి సేవలు వెలకట్టలేనివి



విద్యార్థినులకు చెక్కులు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

గుంతకల్లుటౌన్: లక్ష్మీ కటాక్షం లేని సరస్వతీ పుత్రికల విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న అభయ విద్యానిధి సొసైటీ సేవలు వెలకట్టలేనివని గేట్స్ కళాశాల అధినేత్రి వీకే పద్మావతమ్మ, డాక్టర్ లక్ష్మీ బాలయ్య అన్నారు. ఆదివారం రోటరీక్లబ్ ఆడిటోరియంలో ప్రోగ్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థినులు అమృత (ఎంబీబీఎస్),ఆరీఫా(బీడీఎస్), ఉదయాంజలి, సబీహ సుల్తానా, జింకల శ్రీలత(బీటెక్), నవ్యశ్రీ, కీర్తన(ఎంబీఏ), లిఖిత, మీనాక్షి(బీఫార్మా–డీఫార్మా)కు అభయ విద్యానిధి ద్వారా రూ.3.87 లక్షల సాయమందించారు. మరో విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేశారు. అనంతరం సొసైటీ వ్యవస్థాపకురాలు వసుంధరాదేవి, అధ్యక్షురాలు మాధవీలత, కార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి అనురాధ గుప్తలతో పాటు సొసైటీకి ఆర్థిక సహకారం అందించిన దాతలందరినీ సొసైటీ సభ్యులు సత్కరించారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి

యల్లనూరు: మండలవ్యాప్తంగా బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పాలని ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం వారు మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి విద్య నేర్పించాలన్నారు. అలాగే డ్రాప్‌అవుట్ పిల్లలను కస్తూర్బా విద్యాలయం, మోడల్ స్కూల్లో చేర్పించాలన్నారు. ఏదైనా సందేహాలు ఉంటే ఎమ్మార్సీలో సంప్రదించాలన్నారు.

వేడుకగా లక్ష మొక్కల పంపిణీ



మాట్లాడుతున్న వీరబ్రహ్మేంద్రస్వామి వేషధారి

నార్పల: మండలకేంద్రంలోని సిద్ధార్థ పిరమిడ్ కేంద్రం ఆవరణలో సీనియర్ మాస్టర్ హనుమంతు ఆధ్వర్యంలో లక్ష మొక్కలు పంపిణీ కార్యక్రమం వేడుకగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనంతపురం,నార్పల మండలంలోని ధ్యానులు హాజరయ్యారు. ఈసందర్భంగా బత్తలపల్లికి చెందిన అహమ్మద్ బాషా వీరబ్రహ్మేంద్ర వేషం ధరించి, స్వామి వారి తత్వాలు, కాలజ్ఞానం, మానవ జీవన విధానం, అత్తా, కోడళ్ల సఖ్యత, భార్య,భర్తల బాంధవ్యం, తల్లిదండ్రులు ప్రవర్తన నియమాలు, పిల్లలు ప్రవర్తన గురించి ప్రసంగం చేశారు. ధ్యాన ప్రస్తావన కార్యక్రమం ఎన్నో కుటుంబాల్లో వారి జీవన విధానంలో మార్పులు తీసుకువచ్చిందన్నారు. అనంతరం లక్ష మొక్కలు పంపిణీ చేశారు.

ముందస్తు చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న డీపీఎంఓ రవిశంకర్

పెద్దపప్పూరు: డయేరియా కేసులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీపీఎంఓ రవిశంకర్ సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని దేవుని ఉప్పలపాడు గ్రామాన్ని సందర్శించి ప్రజల ఆరోగ్యసమస్యలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకోకూడదని ఆయన సూచించారు. అనంతరం డయేరియా సోకిన వారి ఇళ్ల వద్దకు ఆయన వెళ్లి పలు సూచనలు చేశారు. ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సురేంద్ర రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాష్ వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తొండపాడులో ఆర్‌బీకే శిలాఫలకం ధ్వంసం



ధ్వంసం చేసిన శిలాఫలకం



ధ్వంసం చేసిన నవరత్నాల శిలాఫలకం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో రైతు భరోసా కేంద్ర శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ధ్వంసం చేశారు. గ్రామ శివారులోని బొలికొండ రంగనాథ స్వామి ఆలయ మాన్యం భూముల సమీపంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫోటోతో ఉన్న నవరత్న పథకాలకు సంబంధించి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అటుగా వెళ్లిన గ్రామస్తులు శిలాఫలకాలను ధ్వంసం చేసిన విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అసలే ఫ్యాక్షన్ గ్రామం కావడంతో విషయం తెలుసుకున్న సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ హుటాహుటిన సిబ్బందితో కలసి గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు. కాగా గుత్తి మండలంలో ఎన్నడూ లేని విష సంస్కృతిని టీడీపీ ప్రభుత్వం తెచ్చిందని స్థానికులు చర్చికుంటున్నారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాటు సారా విక్రేత అరెస్టు



నాటుసారా విక్రేతను అరెస్టు చూపుతున్న సీఐ నాగార్జున రెడ్డి

యాడికి: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. గత కొంత కాలంగా మండలంలోని చిక్కేపల్లె శివారులో గ్రామానికి చెందిన సిద్దవటం చిన్న భీమేశ్వర రెడ్డి నాటుసారాను విక్రయిస్తున్నాడనే సమాచారంతో ఆదివారం సాయంత్రం సీఐ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. నిందితుడిని అరెస్టు చేసి 8 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు(36) అనే వ్యక్తి ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పులు ఎక్కువ కావడంతో వాటిని తీర్చలేక అతడు మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీరే మార్గం కానరాక విష రసాయనం తాగాడు అయినా బతుకుతానని భావించి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్న ప్రదేశంలో తనకు అప్పులు ఉన్నాయని, తన లాంటి బతుకు ఎవరికి వద్దని పేపర్లో రాసిపెట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

అమ్మవారిశాలల్లో పూజలు



పూజలందుకుంటున్న ముసలమ్మ తల్లి



కాశీ విశాలాక్షి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో ప్రముఖ పురాతన కాశీ విశ్వేశ్వర దేవాలయం, ముసలమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ముసలమ్మ తల్లి, కాశీ విశాలాక్షి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా పూర్ణాహుతి హోమం



అలంకరణలో వేదగాయత్రీదేవి

తాడిపత్రి అర్బన్: ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సంజీవనగర్ మొదటి రోడ్డులోని వేద గాయత్రీదేవి ఆలయంలో ఆదివారం పూర్ణాహుతి హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు వేద గాయత్రీదేవి, అమరలింగేశ్వరులకు విశేష అభిషేకం చేశారు. అనంతరం 9.30 నిమిషాలకు పంచాయతన హోమాలు చేసి పూర్ణాహుతి నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పూర్ణాహుతి హోమంలో పాల్గొన్నారు. భక్తులు వేద గాయత్రీదేవిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంకకొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ అమ్మవారు

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో ఆదివారం ఆరాదనోత్సవం వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన భజన బృందం సభ్యులు భక్తి గీతాలను ఆలపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రార్థిస్తున్న పాస్టరమ్మ సువర్ణమ్మ

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టరమ్మ సువర్ణమ్మ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుని యందు ప్రార్థన, విశ్వాస జీవితం కలిగి జీవించాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో దంపతుల మనస్పర్ధల విషయంలో ఘర్షణ పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. ఆదివారం ఎస్ఐ మాట్లాడుతూ కల్లూరుకు చెందిన ప్రభాకర కుమార్తె అనుషకు 2021లో తోపుదుర్తికి చెందిన రాజశేఖర్‌తో వివాహం అయిందన్నారు. కుటుంబ కలహాల వల్ల ఇటీవల భార్య, భర్త గొడవ పడ్డారన్నారు. ఈ క్రమంలో అనుష కల్లూరులో తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉండగా శనివారం రాజశేఖర్ తన బంధువులతో కలసి భార్య వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో ఇరు వర్గాల వారు వాదులాడుకుని ఘర్షణ పడ్డారన్నారు. దీంతో ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోవ డంతో ఒక వర్గంలో ఆరుగురు, మరో వర్గంలో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రం గ్రామ సమీపంలో ఆదివారం ఇసుక ట్రాక్టర్ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను 74 ఉడేగోళం గ్రామానికి చెందిన సందీప్ ట్రాక్టర్‌లో రాయదుర్గం పట్టణానికి తరస్తుండడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. సందీప్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.